# ఆమె నా భార్య కాదు

పి.ఎస్.నారాయణ



# ఆమె నా భార్య కాదు

## (నవల)

స్వాతి

సపరివార పత్రికలో

**30.01.2004 నుండి 14.05.2004 వరకు**

ధారావాహికంగా ప్రచురింపబడింది.

**వెల:రు.120**

# ఆమె నాభార్య కాదు

డిశంబరు నెల. బెంగుళూరు సిటీ కబ్బన్ పార్క్‌లో వున్న హోటలో మయూరాలో ఏసీ గది. రాత్రి పదిగంటల సమయం.

"ఏసీ ఆపేస్తాను!" అన్నది స్మిత. అప్పుడే భోజనం చేయటం అయింది. బేరర్ వచ్చి ఖాళీప్లేట్లు తీసుకు వెళ్ళాక పక్కగా టీపాయ్ మీద వున్న పాన్లు అందుకొని వాటికి చుట్టిన కాగితాన్ని తీస్తూ అడిగింది.

"నేను తప్పు చేశాను! నిన్ను కొడయికెనాల్ తీసుకు వెళ్ళాల్సింది!"

"వణుక్కుంటూ కూర్చోవటానికా?" అన్నది మురిపెంగా– పదిరోజుల క్రితమే భర్త అయిన ఉదయ్‌ను చూస్తూ స్మిత.

"ఎప్పుడైనా వేడి పుట్టేది వణుకునించే... కదలిక లేకపోయినా, శరీరం కాలకపోయినా ఆనందమేమున్నది ... కొడయికెనాల్లో ఈ చలిలో రజాయి లోపల శరీరాలు పుట్టించే వేడి జీవితానికి ఎంత అనుభూతిని కలిగిస్తుందో తెలుసా?" అన్నాడు ఉదయ్.

"ఇంతకీ నన్ను ఏసీ ఆపమంటారా, వద్దా?" చిరుకోపంతో అన్నది స్మిత.

చొక్కా విప్పి స్టాండుకు తగిలిస్తూ, "ఇంకా పెంచమంటాను!" అన్నాడు అతను.

"పగలంతా విశ్రాంతి లేకుండా తిరిగాం... నిద్రపోవాలి!" ఏసీ ఆపేస్తూ అన్నది.

“వేడి తగ్గితే నిద్ర ముంచుకురావటానికి నిముషం కూడా పట్టదు!” కొంటెగా భార్య ముఖంలోకి చూస్తూ, “కిటికీలన్నా తెరు!” అన్నాడు ఉదయ్.

స్మిత అయిదడుగులు ఏడంగుళాలు వుంటుంది. ఉదయ్ చెవులదాకా వస్తుంది. పందిరికిపాకిన లతలా సన్నగా వుంటుంది. ముఖం పొడుగ్గా వుండి కొనదేరిన ముక్కు. దానికి అటూ యిటూ రెండు చేపల్ని అతికించినట్లుగా విశాలమైన కళ్ళు. సన్నని పెదవులు.

మెళ్ళో బంగారు గొలుసులు వున్నయ్యా, లేవా అన్నట్లుగా మెరుపులీనుతుండే శరీరపు రంగు. దివినుంచి భువికి దిగివచ్చిన దేవతలా వుంటుంది. ఆమె అందంముందు ఉదయ్‌గూడా తీసిపోడు రంగులోగాని, రూపంలోగాని! పెళ్ళిలోనే రెండువైపుల పెద్దవాళ్ళూ ఇరువురినీ చూస్తూనే అభినందనల జల్లు కురిపించారు ‘సరయిన జోడీ’ అంటూ.

“స్మితా! రేపు ఓ పని చేద్దామనుకుంటున్నాను. పొద్దున్నే బయల్దేరి మైసూరు వెళ్దాం... రెండు రోజులు సరదాగా తిరిగి ఎల్లుండి సాయంత్రం ఇక్కడకు వచ్చి రెస్టు తీసుకుందాం!” అన్నాడు ఉదయ్.

వాళ్ళు పెళ్ళయ్యాక మూడు నిద్రలు రెండు చోట్లా అవగానే హనీమూన్‌కు బయల్దేరారు.

“రెస్టంటే!” అడిగింది స్మిత.

“ఈ హోటల్ గదిలో తలుపులు తెరవకుండా– ఏసీ ఆన్‌చేసి– అది పగలో రాత్రో తెలియనంతగా విశ్రాంతి తీసుకోవటం అన్నమాట... మళ్ళీ ఇక్కడనుంచి గోవా వెళ్ళామనుకో అక్కడ సముద్రపు ఒడ్డున పరుగెత్తుకుంటూ ఎంచక్కా పాటలు పాడుకోవచ్చు!” అన్నాడు ఉదయ్.

“మళ్ళీ చెప్పండి... మళ్ళీ చెప్పండి!” అన్నది స్మిత మంచం మీద కూర్చొని రెండు దిండ్లు ఒళ్ళో పెట్టుకొని ముందుకు వంగుతూ.

సరిగ్గా అప్పుడే సెల్ 'కుయ్‌కుయ్' మన్నది. స్మిత పరుగెత్తుకుంటూ వెళ్ళి టీపాయ్‌మీద వున్న సెల్ తీసుకొని ఆన్ చేస్తూనే, "హాయ్ మమ్మీ!" అన్నది సంతోషంగా దానిమీద వున్న నంబరు చూస్తూనే, ఆపైన తల్లి కంఠం వింటూ.

"బెంగుళూరంతా తిరిగి చూచారా?" అని అడిగిందామె.

"పగలంతా బాగా తిరిగాం మమ్మీ... పెందరాళే వచ్చి రూంలో రెస్ట్ తీసుకుంటున్నాం!" అన్నది– అ మాట అంటుండగానే అంతకుముందు ఉదయ్ 'రెస్ట్'కు చెప్పిన అర్థం గుర్తుకు రాగా ముఖమంతా సిగ్గుతో ఎర్రబడిపోయింది. ఆమె ముఖాన్ని చూస్తూనే నవ్వి తలమీద మొట్టాడు ఉదయ్.

"రేపు తెల్లవారుజామునే మైసూర్‌కు వెళుతున్నాం. ఎల్లుండి రాత్రికి తిరిగి ఇక్కడకు వచ్చి గోవా వెళ్ళాలనేది ఆలోచన!" చెప్పింది స్మిత.

"మీరెక్కడున్నా పొద్దునా, సాయంత్రం ఫోను చేస్తుండండి... ఇబ్బందేం పడటంలేదు గదా... ఉదయ్ ఎలా వున్నాడు... అదిసరే... మీ నాన్న స్నేహితుడు అమెరికానుండి ఫోను చేశాడే. ఇంకా పదిహేను రోజుల్లో మీ ఇద్దరికీ ఆయనకు తెలిసిన కంపెనీ వాళ్ళు అర్డర్స్ పంపిస్తున్నారట... రెడీగా వుండమని చెప్పాడు!"

"థాంక్స్ మమ్మీ! చాలా మంచివార్త చెప్పావ్!" ఆనందంగా అన్నది స్మిత.

"ఏమో... నువ్వయితే అమెరికా వెళ్ళటానికి మహా ఉబలాటపడుతున్నావుగాని– నాకే నిన్ను అంత దూరం పంపాలంటే దిగులుగా వున్నది!"

"ఇంత దూరాన వున్నామా ఇప్పుడు... అయినా మనం మాట్లాడుకోవడం లేదా... రేపు అమెరికాలో వున్నా అంతే! నా ఫ్రెండ్సంతా అక్కడే వున్నారు మమ్మీ... నాకు ఇంకా వెళ్ళకపోవడమే చిన్నతనంగా వున్నది– ఇంత చదువూ చదివి ఇంట్లోనే వుండిపోవాలా ఏమిటి?" అన్నది.

"ఎట్లాగూ వెళుతూనే వున్నావుగదా... దిగులు దేనికి– ఆపదేదేదో మేంపడాలిగాని... నా దగ్గర రలాయించినట్లుగా ఆ అబ్బాయి దగ్గరా రలాయిస్తున్నావా...

చెప్పిన మాట విను– బెదిరిపోయేను!” అన్నది తల్లి.

“నిన్న పొద్దున మీ అల్లుడుగారన్నారు– స్మితంత మంచిపిల్ల ఈ ప్రపంచంలో మరొకరు లేరుట... నీకు వెంటనే ఫోను చేసి చెప్పేద్దామనుకున్నాను గానీ... అప్పుడు మేం సరిగ్గా లాల్‌బాగ్‌లో గ్లాస్‌హౌస్ దగ్గర పూలచెట్ల మధ్య వున్నాం!” అన్నది ఎగతాళిని కొద్దిగా మాటలకు అద్దుతూ. “అక్కడనుంచి ఫోనుచేస్తే నలుగురూ విని నవ్వుతారేమోనని బిడియపడ్డానే!” అంది.

“కానీ మధ్యాహ్నం ఉదయ్ నాకు ఫోనుచేసి– అప్పుడు నువ్వు రూంలో నిద్రపోతున్నావటలే– ఏంవండీ... మరీ ఇంత పెడసరపు పిల్లకు మీరు తల్లి అవడం నాకు బాధగా వున్నది... అయినా ఎప్పుడూ మంచి వాళ్ళకు ఇలాంటి పిల్లలే పుడతుంటారు లేండి... ఏంచేస్తాం– అని చప్పరించాడే... ఏంవో బాబూ! నువ్వు చెబుతున్న మాటలు నాకు నమ్మబుద్ధి కావడంలేదు!” అన్నది తల్లి మరింత కొంటెగా.

ఆ దంపతులకు ఒక కూతురు, ఒక కొడుకు. చక్కటి సంసారం. ఆయన హైదరాబాద్‌లో ఏవన్ కాంట్రాక్టరు. బంజారాహిల్స్‌లో ఆకాశంలో కట్టారా అన్నంత ఎత్తులో భవంతి. ఇంట్లో అందరికీ తలా ఒక కారు... మనస్సులో కోరికలు నాలిక మీదకు వస్తుండగానే తీరేటందుకు మూలమూలలా మూలుగుతున్న డబ్బు!

అంత డబ్బుంటేనేం... అక్కా, తమ్ముళ్ళు చదువులో ఫస్టే! స్మిత ఈ ఏడే బి.టెక్ పూర్తి చేస్తే– ఉదయ్ మూడేళ్ళ నాడే పూర్తి చేసి హైదరాబాద్‌లోనే ఐటీలో ఎదిగిపోతున్న ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా చేస్తున్నాడు.

స్మిత తన అభిప్రాయం తండ్రికి చెప్పింది. “నేను కనీసం నాలుగయిదేళ్ళు అమెరికాలో ఉండి, ఐటీలో నిష్ణాతురాలినై వచ్చి సైబర్ సిటీలో నేనే ఒక కంపెనీని ఫ్లోట్ చేయాలనేది నా కోరిక నాన్నా! నాతో పాటు అమెరికా వచ్చి, మళ్ళీ భారతదేశం తిరిగి రావాలనే ఉద్దేశ్యం ఉన్నవాడినే నాకు భర్తగా వెతుకు!”

“నీ మాటే నాకు వేదం కదరా కన్నా!” అన్నారు ఆయన కూతురి మాటలకు మురిసిపోతూ.

ఫోన్ చేస్తుండగానే, "చీరతోనే మంచమెక్కటమా... లేక నైటీలోకి మారాల్సిన అవసరం ఏమైనా వున్నదా?" కొంటెగా అన్నాడు కళ్ళు చికిలించి ఉదయ్.

"ఇలా ప్రతిదాంట్లోనూ కల్పించుకోవటం నాకిష్టం ఉండదు!" అన్నది ముఖం తిప్పుకుంటూ స్మిత. "మీరు బైటకు వెళితే నేను డ్రస్ మార్చుకుంటాను!"

"ఓకే... ఓకే... నేను బయటకు వెళతాను... నువ్వు తలుపేసుకుంటావ్... నాకేం చేయాలో తెలియక వరండాలో కాలుగాలిన పిల్లిలా అటూయిటూ తిరుగుతుంటాను... ఇంతలోనే ఎవరో వచ్చి, 'ఏంటి బాబూ! ఎవరికి లైనెయ్యాలని ఇలా అర్థరాత్రప్పుడు వరండాలో తిరుగుతున్నావ్... ఎవరైనా తలుపు తీసుకు వస్తానని ప్రామిస్ చేశారా?'- అని చొక్కా పట్టుకున్నాడనుకో- నేను వాడి కాళ్ళు పట్టుకొని, 'ఛ!ఛ... అదేం కాదండి... మా ఆవిడ కొత్త పెళ్ళికూతురు... నా ముందు చీర మార్చుకోవటానికి సిగ్గు పడుతున్నదీ' అని నేను దీనంగా చెబితే- అతగాడు నన్ను ఒక్కసారి ఓ చతుష్పాద జంతువుని చూచినట్లుగా వింతగా చూచి- ముళ్ళపూడి వెంకట రమణ జెల్లకాయ ఒకటి నా నెత్తిన ఇచ్చి చక్కా వెళ్ళిపోతాడు. అప్పుడు ఆ అవమానంతో తలకాయను తీసుకువెళ్ళి నేను ఎక్కడ పెట్టుకోవాలి- నీ ఒళ్ళోనే కదా- కనుక అమ్మడూ... ఒక పని చేయి... నువ్వు అంతగా సిగ్గు పడుతున్నావు కాబట్టి నేను కింద రిసెప్షనిస్ట్‌కు ఫోను చేసి- రేపు మైసూరు వెళ్ళేటందుకు కారు ఏర్పాటు చేసే విషయంలో కళ్ళు మూసుకు మాట్లాడుతుంటాను... నీ పని నువ్వు కానిచ్చేసేయ్... కమాన్!" అన్నాడు ఫోనెత్తుతూ.

"మధ్యలో ఒక్కసారిగూడా కళ్ళు తెరవగూడదు!"

"రిసెప్షనిస్ట్‌మీద ఒట్టు... తెరవను గాక తెరవను!"

స్మిత అతడి పక్కనే వచ్చి కూర్చుంటూ, "ఇప్పుడా అమ్మాయి ఎందుకు గుర్తుకు వచ్చిందబ్బా!" అన్నది.

"ఇంత రాత్రి పూట అక్కడ అమ్మాయిలుండరు... అబ్బాయిలేగాని నన్ను అపార్థం చేసుకోవద్దు!"

మూతి తిప్పుతూ లేచి నిలబడింది స్మిత.

"అవునూ- రెండు రోజులు మైసూరు... జూ చూడాలి... మహారాజుగారి ప్యాలెస్ చూడాలి.., శ్రీరంగపట్నం వెళ్ళాలి... టిప్పు సుల్తాన్ కోట చూడాలి... గవర్నమెంటు సిల్కు ఫ్యాక్టరీలో నీకు నచ్చిన చీర కొనాలి... చాముండేశ్వరీదేవి ఆశీర్వచనాలు తీసుకోవాలి! ఐదు మీటర్లు ఎత్తున్న నందిని మెట్లల్లా దిగి చూడాలి... అరెరేయ్!... ఒక్కమాట... రిసెప్షనిస్ట్‌కు చెప్పేస్తాను... మనకు ఈ రెండు రోజులూ ఓ ఫైవ్‌స్టార్ హోటల్లో ఏసీ రూం బుక్‌చేయమని- ఆపైన టాక్సీ మనం ఇక్కడకు తిరిగి వచ్చిందాకా మనతోపాటే వుండాలని!"

ఉదయ్ రిసెప్షన్‌కు ఫోన్‌చేసి చేయాల్సిన ఏర్పాట్లన్నీ చెప్పేశాడు.

"మేం ఎనిమిదింటికి బైల్దేరతాం!"

"ఫైన్!" ఫోన్ పెట్టేసి కళ్ళు తెరిచాడు ఉదయ్. "మైగాడ్... నీకు మ్యాజిక్ తెలుసా క్షణాలమీద మారిపోయావ్!" అన్నాడు నైటీలో వున్న స్మితను చూస్తూనే.

"ఎస్ సార్!" అన్నది ఆమె కళ్ళు మూసి తెరిచి ఎగసి వస్తున్న నవ్వును బలవంతాన బిగపట్టుకుంటూ.

"రేపు సాయంత్రం బృందావన్ గార్డెన్స్‌కే మన ఈ శరీరాలు అంకితం- గుర్తుంచుకో!" అన్నాడు.

"కనుక మహాశయా! నాదో సలహా... రెండు రోజుల్లో మనం ఇన్ని తిరగాలి కాబట్టి- గదిలో ఎక్కువ సేపు రెస్ట్ తీసుకోవటం ఆరోగ్యానికి మంచిది గదా!"

''అదేగదా స్మితారాణీ నేను చెబుతున్నది... లైటుంచమంటావా తీసేయమంటావా?" అడిగాడు అతను.

"మైసూరులోనన్నా రెండు సింగిల్ రూంలు తీసుకోండి బాబు!" అన్నది స్మిత ఉదయ్ చెవి పట్టుకొని.

చటుక్కున తలెత్తి, "సారీ మేడమ్! నా మట్టి బుర్రకు అసలు తట్టనే లేదు... ఛ!ఛ!... ఈ గదిలో రెండు మంచాలుండటంతో నువ్వెంత ఇబ్బంది పడుతున్నావో నాకర్థమయింది... సారీ!సారీ!... ఇప్పుడే ఒక మంచాన్ని బయటకు పంపించేస్తానుండు... రెసెప్షనిస్ట్‌కు ఫోను చేసి చెబితే నీ కోరిక రెండు నిముషాల్లో తీరి పోతుంది!" అన్నాడు కంగారు పడుతున్నట్లుగా లేచి ఉదయ్.

"ఏం మొగుడు దొరికాడండీ బాబూ... ప్రతిదానికీ పెడర్థమే!" అన్నది గొంతును సాగదీస్తూ స్మిత.

మరునాడు సాయంత్రం ఆరు గంటలప్పుడు-

మైసూర్ బృందావన్ గార్డెన్స్‌లో... చెట్ల పచ్చదనాన్ని, రంగురంగుల పూలవనాల్ని చూస్తూ వాళ్ళిద్దరూ ఫౌంటెన్ వైపుకు మెట్లు దిగుతుండగా... మూడో కన్ను తెరిచివున్న చలిదేవతకు ఒత్తాసుగా నీలి ఆకాశంలో తూర్పువైపు నుంచి తల పైకెత్తుకొస్తున్న చంద్రుడు, ఆపైన కళ్ళు చెదిరే దీపాల క్రిందగా ఆడామగా జంటలు... పిల్లల కేరింతలు...

"ఇక్కడ ఇంత కోలాహలంగా వున్నదా... ఎల్లుండి సాయంత్రం ఎలా వుంటుందో చూడు... మనం సముద్రంలోకి దూకేటందుకు లో దుస్తుల్లో, బంగారు రేణువుల ఇసుకలో చెట్టాపట్టాలు వేసుకు పరుగెడుతూ..."

"ఛ!" సిగ్గు పడుతూ అన్నది స్మిత.

"ఒంటిన గుడ్డలుంటే 'ఛ' అని నవ్వినా నవ్విపోతారు అక్కడ విదేశీయులంతా!" అన్నాడు స్మిత చేతిని పట్టుకొని భుజం మీదకు తీసుకుంటూ ఆమె వారిస్తున్నా వినకుండా. "తెలిసిన వాళ్ళెవ్వరూ ఇక్కడ లేరు మనల్నిచూసి మెలికలు తిరిగిపోతూ సిగ్గుపడటానికి!"

ఓ పక్కగా కోటగోడలా వున్న కృష్ణరాజసాగర్ డ్యామ్... దాని కిందగా బృందావనం... మధ్యలో పొడుగ్గా నీలిరంగు ఫౌంటెన్‌లో సన్నగా అలలతో కదలాడుతున్న నీరు... అటూయిటూ దీపాలబారులు... కత్తిరించిన గుబుర్లు...

ఎరుపు రంగులో ఆ గుబుర్ల అందానికి ఫ్రేము కడుతున్నట్లుగా పొదల బారులూ...

జనం అప్పుడప్పుడే లోపలకు వస్తున్నారు. ఆరోజు వర్కింగ్‌డే అవ్వడంతో జనం పలచగా వున్నారు. ముందుకు వున్న మ్యూజికల్ ఫౌంటెన్‌వైపుకు ఇద్దరూ నడుస్తున్నారు. పరిసర అందాల్ని చూస్తూ తన్మయంగా మాట్లాడుకుంటూ అడుగులేస్తున్న ఇద్దరూ ఒక చోట చటుక్కున ఆగారు. స్మిత ఉదయ్ భుజం మీదనుంచి చేతిని విసురుగా లాక్కొని వెనక్కు తిరిగింది.

అప్పటికే ఆమెను దాటి వెళ్ళిన ఓ యువకుడు తల వంచుకొని ఐదారు అడుగులు వేయనేవేశాడు హుషారుగా ముందుకు.

"హలో మిస్టర్!" పిలిచింది స్మిత.

అతడు ఆగి వెనక్కు తిరిగాడు.

"ప్లీజ్!" అన్నది దగ్గరకు పిలుస్తున్నట్లుగా చేయూపుతూ నవ్వి. అతడు కళ్ళు పెద్దవి చేసుకొని విస్మయంగా స్మిత వంకే చూస్తూ నిలబడిపోయాడు బొమ్మలా.

"మిమ్మల్నే!" అన్నది అతడి వైపుకు అడుగులు వేస్తూ. ఉదయ్ స్మితనే చూస్తున్నాడు అతడిని ఎందుకు పిలుస్తున్నదో అర్థంగాక.

అతడూ స్మిత ఎదురెదురుగ్గా నిలుచున్నారు. స్మిత పెదాలమీద చిరునవ్వు చిందుతునే వున్నది.

"అవును– నేను రంభనే... కాదనే దమ్ము ఎవరికున్నది?" అంటూనే ఎడంకాలి చెప్పు తీసుకొని అతడి చెంప ఛెళ్ళుమనేలా కొట్టసాగింది. "ఆ నిజం చెప్పటానికి నీ భుజంతో నా భుజాన్నల్లా కొట్టాలా?"

అతడు రెండు చెంపలకు చేతులడ్డం పెట్టుకొని అక్కడే కూలబడిపోయాడు. ఉదయ్ కంగారుగా ఆమె చేయి పట్టుకున్నాడు.

ఆమె కళ్ళు నిప్పులు కురిపిస్తున్నాయి. కాస్త అటూయిటూగా నడుస్తున్న మనుష్యులు

వీళ్ళచుట్టూ మూగసాగారు. ఆమె ఎందుకు చేసిందో ఆపని అర్థమయ్యేటప్పటికి ఉదయ్ గాభరా పడ్డాడు.

ఇంతలోనే ఒక కానిస్టేబుల్ వచ్చాడు అక్కడికి. అతడికి జరిగింది చెప్పి, "లాక్కెళ్ళి లాకప్‌లో పారేయండి వెధవని!" అంటూ ఉదయ్ చేయిపట్టుకొని నడవసాగింది స్మిత.

జనం విస్మయంగా చూడసాగారు స్మిత వంక– అతడి వంక కళ్ళు తిప్పుతూ– 'ఆడపిల్ల అంత ధైర్యంగా లేకపోతే ఈ ప్రపంచంలో బ్రతకటం కష్టం' అన్నట్లుగా.

పదడుగులు ముందుకు వేసిం తరువాత స్మిత ముఖంలోకి చూస్తూ ఉదయ్ అన్నాడు. "నాకు చెప్పొచ్చు గదా!" అని.

"మీరు ఏం చేసేవారు... దగ్గరకు పిలిచి మర్యాదగా కోప్పడేవారా... వాడు వెంటనే, 'నేను కాదు మీ ఆవిడే నా భుజానికి కొట్టింది' అనేవాడు– అప్పుడేం చేసేవారు!" స్మితకు ఇంకా ఆవేశం తగ్గలేదు అని ఎగిరెగిరి పడుతున్న ఆమె ఛాతే చెబుతున్నది.

ఆమె మాటలకు బిత్తరపోయి ఆమెనే చూస్తూ వుండిపోయాడు ఉదయ్.

"నేను రెండు పీకేటప్పటికల్లా గుడ్లు తేలేశాడు!" ఆవేశంగా అంది స్మిత.

ఉదయ్ అస్థిమితంగా అటూ ఇటూ కదిలాడు. "వెళ్ళిపోదామా రూంకి!" అన్నాడు వాడి మూలకంగా గొడవ అవుతుందేమోనని భయపడుతూ.

"ఏమైందని ఇప్పుడు?" అంది స్మిత.

"రౌడీ వెధవలు... వాళ్ళతో మనకేమిటి...మనకిక్కడ ఎవ్వరూ తెలిసిన వాళ్ళు గూడా లేరు!"

స్మిత పకపకా నవ్వింది. "వాడికి అంత పెద్ద గ్యాంగే వుంటే ఇప్పటికే మనని చుట్టుముట్టే వాళ్ళు... ఏం కాదు పదండి!" అతడి చేతిలోని తన చేతిని తీసుకొని ఆ సంఘటన జరక్కముందు నడుస్తున్నట్లుగా అతడి భుజం మీద చేయివేసి నడవసాగింది.

ఆమె ధైర్యానికి అచ్చెరువొంది 'స్మిత డేరింగ్ గరల్! ఎక్కడయినా జయించుకు రాగలదు!" అనుకున్నాడు ఆప్యాయంగా ఆమె చేతిని నొక్కుతూ.

చాలా ముందుకెళ్ళి మలుపు తిరిగేటప్పటికి మ్యూజిక్ ఫౌంటెన్ కనబడింది...

రాత్రి ఎనిమిది దాటింది వాళ్ళు బృందావన్ గార్డెన్స్‌నుంచి బయటకు వచ్చేటప్పటికి.

మరునాడు ఉదయాన్నే చాముండీ ఆలయానికి వెళ్ళి దైవదర్శనం చేసుకుంటే బాగుంటుంది అనుకున్నారు. అందునా ఆ రోజు శుక్రవారం.

"మా తమ్ముడికి చందనపు చెక్క సరస్వతి బొమ్మ కొనాలి! వాడి గదిలో టేబుల్ మీద పెట్టుకుంటాడు!"

"గవర్నమెంట్ ఎంపోరియంకు వెళ్దాం... మోసం వుండదు... అసలైన చెక్కతో చేసింది దొరుకుతుంది!"

ఆ రాత్రి రెస్టారెంట్‌లో భోజనం చేసి మేడ మీద తమ గదిలోకి వెళ్ళేటప్పటికి పది గంటలయింది.

"రేపుదయం మొదట ప్యాలెస్ చూద్దామా... దేవాలయానికి వెళ్దామా?" అడిగాడు ఉదయ్.

"మనం ఇప్పుడు పడుకోవాలి అంటాను!"

"అంటే రెస్ట్ తీసుకోవాలీ అనే కోరిక మళ్ళీ విజృంభించేస్తున్నదన్నమాట!" కొంటెగా అన్నాడు ఉదయ్.

"ఇవ్వాళ నేను కింద పడుకుంటాను!"

"అరెరె! చెప్పడం మరిచానోయ్... మా డాక్టర్ అన్నాడు... సంవత్సరానికి ఆరునెలలు కటిక నేలమీద దిండు లేకుండా పడుకుంటే- బ్రతికున్నంత కాలం నడుంనొప్పి రాదన్నాడు. నేను మర్చిపోయినా నువ్వు గుర్తు చేశావురా... థాంక్యూ....

థాంక్యూ!" అంటూనే ఆమెను కౌగిలించుకొని ఉక్కిరి బిక్కిరి చేయసాగాడు తమకంతో.

"ఛీ! ముందు వదలండి నన్ను!" చికాగ్గా అన్నది అతడిని త్రోసేస్తూ.

"అంటే... అంటే!" ఒక్క క్షణం ఆగాడు ఆలోచిస్తున్నట్లుగా. "ముందు వదలండి నన్ను అంటే... అచ్ఛా... అచ్ఛా... అర్థమయింది... ముందునుంచి కౌగిలించుకోవద్దు... వెనుకనుంచి కౌగిలించుకోండి అనేగదా నువ్వు అనేది ... అసలు నిన్ను చూస్తుంటే నాకు అంతా మతిమరుపు, కంగారు... ఓకే... ఓకే...!" అన్నాడు ఉదయ్.

ఉదయ్‌ని ఒక్క తోపు తోసింది స్మిత. అతడు వెనక్కు వెళ్ళి మంచం మీద పడిపోయి, "అబ్బా...కాలువిరిగింది!" అన్నాడు పాదం పైకి లేపి పట్టుకు కూర్చొని.

"రిసెప్షనిస్ట్‌కు ఫోను చేయండి డాక్టర్ని పంపమని!" అంటూనే ఆమె చీర విప్పేసి మాక్సీ వేసుకొని– ట్యూబ్ లైట్ ఆర్పి బెడ్ ల్యాంప్ వెలిగించి అటుతిరిగి పడుకున్నది.

అతడు నవ్వుతూ ఆమెనే చూస్తున్నాడు. ఆమె సన్నని నడుం మీద కితకితలు పెట్టాలి అన్నట్లుగా ముందుకు వంగాడు. అప్పుడే ఉదయ్ జేబులోని సెల్ మోగింది.

చటుక్కున ఇటు తిరిగింది స్మిత. "ఇటివ్వండి... మా అమ్మ!" అంటూ ఫోను లాక్కోబోయింది.

అతడు సెల్‌వున్న చేతిని వెనక్కు తీసుకుంటూ, "ఏం... మా అమ్మ ఎందుకు కాగూడదు... చూడనీయ్!" అన్నాడు.

అతడు దాని మీద నంబరు చూచాడు. నుదురు ముడిబడింది. ఆన్ చేశాడు. "ఉదయ్‌ని మాట్లాడుతున్నాను... ఎవరు మాట్లాడుతున్నది!" అడిగాడు.

"నేను చంద్రశేఖరాన్నిరా!" ఆయన ఉదయ్ పెద్దన్నయ్య. అది పొన్నూరులో తన ఇంటి నెంబరు.

"మీరు పొన్నూరు ఎప్పుడు వచ్చారు? ఢిల్లీ వెళ్ళలేదా?"

"గంటైందిగాని... నువ్వు వెంటనే పొన్నూరు రావాలి!"

"ఏమైంది?" ఆత్రంగా అడిగాడు.

"నాన్నకు హార్ట్ ఎటాక్ వచ్చింది... ఇప్పుడు కులాసాగా వున్నారులే... నిన్నూ, స్మితనూ చూడాలంటున్నారు!"

"హైద్రాబాద్‌లో అన్ని ఆసుపత్రులు పెట్టుకొని పొన్నూరు ఎందుకు వచ్చారు? లేచి మాట్లాడుతున్నాడా నాన్న!" ఆదుర్దాగా అడిగాడు ఉదయ్.

"ఇంటికి వెళ్దామని పట్టుబట్టాడు... అందుకే మధ్యాహ్నం వచ్చాంగాని... నువ్వు కారు తీసుకొని బయిల్దేరు!"

"అమ్మను పిలువు!" అన్నాడు ఆయన మాటలకు కంగారు పడుతూ ఉదయ్.

"ఆమె నిద్ర పోతున్నది... లేపమంటావా?"

"నాన్న కులాసా కదా?" తనకు తాను ధైర్యం చెప్పుకోవాలి అన్నట్లుగా మరోసారి అడిగాడు.

"ఏం కాలేదురా నాన్నా! ఆయనకు హార్ట్ ఎటాక్ వచ్చింది గదా... నిన్ను చూడాలని తాపత్రయపడుతున్నాడు– అంతే!" అన్నాడు ఆయన చిన్నగా నవ్వి.

చటుక్కున సెల్ ఆఫ్‌చేసి స్మిత వైపుకు తిరిగాడు.

"ఏమైంది?" అన్నది స్మిత అతడి ఆదుర్దా చూస్తూ.

"నాన్నకు బాగాలేదుట... అందరూ పొన్నూరొచ్చారు... మనల్ని వెంటనే బయల్దేరమంటున్నారు!" అతడి గుండె దడదడలాడసాగింది ఆ మాటలు అంటుంటే.

* * *

రాత్రి పదకొండు గంటలకు కారు దొరకగా అందులో బయల్దేరితే మరునాడు మధ్యాహ్నం రెండు గంటలకు పొన్నూరులో ఊరిబయట కొబ్బరి తోటల నడుమ వున్న పెద్ద భవంతి ముంది దిగారు ఉదయ్, స్మిత.

కారు ఆగుతుండగానే లోపలనుండి అతడి ముగ్గురు అన్నయ్యలూ, ముగ్గురు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Aame+Na+Bharya+Kadu**

* * *